జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
ఆదివారం
12-07-2026
సంపుటి 1 సంచిక 229
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195




## యాదాద్రిలో నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

4లో

## గాన సరస్వతి ఎస్. జానకి కన్నుమూత

4లో



### ‘మౌనమేలనోయి’
గాన సరస్వతి ఎస్. జానకి అస్తమయం

ప్రత్యేక కథనం 5లో





### పగతో రగిలిన మనిషి...

# ఆరు ప్రాణాలు బలి

## పోక్సో కేసు పెట్టారని కక్షతో నరమేధం..

### మైనర్ బాలిక కుటుంబంతో పాటు భార్య, ఇద్దరు చిన్నారులనూ కిరాతకంగా హత్య

**మే 16న రాజ్‌కుమార్ పై పోక్సో కేసు నమోదు**

**మే 26న అరెస్టు.. జూలై 10న బెయిల్..**

**అదే రాత్రి ప్రతీకార తాండవం..**

**లక్ష్మీ, రుక్కమ్మ, మైనర్ బాలిక, భార్య సరిత, పిల్లలు పరీక్షిత్, దైవీక్షిత్‌లను హతమార్చి పరారీలో నిందితుడు**

**దశ, రంగారెడ్డి ప్రతినిధి:** ఒక ఫిర్యాదు... ఒక పోక్సో కేసు... ఒక నెల జైలు జీవితం... చివరకు ఆరు ప్రాణాలను బలి తీసుకున్న నరమేధం. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ దారుణం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. తనపై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపించారనే కక్షతో బెయిల్‌పై విడుదలైన పార్వతి రాజ్‌కుమార్ ప్రతీకారానికి దిగాడు. కానీ ఆ ప్రతీకారం కేవలం కేసు పెట్టిన కుటుంబానికే పరిమితం కాలేదు. చివరకు తన భార్య, పసిపిల్లలను కూడా బలి తీసుకుని రక్తంతో చరిత్ర రాశాడు. ఈ ఘటనకు బీజం మే 16న పడింది. 17 ఏళ్ల మైనర్ బాలికను వేధించాడంటూ ఆమె తల్లి లక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాజ్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదైంది. కేసు నమోదు చేసిన పోలీసులు మే 26న అతడిని

..మిగతా 4వ పేజీలో →

## షాబాద్ ఎస్ఐ రమేష్ సస్పెండ్

**దశ, రంగారెడ్డి:** షాబాద్‌లో సంచలనం సృష్టించిన ఆరు హత్యల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణల నేపథ్యంలో షాబాద్ ఎస్ఐ *రమేష్‌ను* ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు చేపట్టిన ఆందోళనను విరమించారు. ఇదిలా ఉండగా, ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. అతడు ప్రయాణించిన కారును నందిగామ సమీపంలో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారు వదిలి నందిగామ రైల్వే స్టేషన్ వైపు వెళ్లినట్లు ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు, సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగిస్తున్నారు.



## 2 చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు!

**‘సర్’ తర్వాత డూప్లికేట్లపై ఉక్కుపాదం**

**89 లక్షల ‘అనామలీస్’ ఓటర్లకు నోటీసులు: సీఈవో సుదర్శన్‌రెడ్డి**

**‘సర్’ పూర్తయ్యాక దేశవ్యాప్తంగా డీఎస్పీ సాఫ్ట్‌వేర్‌తో జాబితా ప్రక్షాళన**

**ఎన్యుమరేషన్ ఫారం తప్పనిసరి..**

**ఫారం ఇవ్వకపోతే ఓటరు జాబితాలో పేరు ఉండదని హెచ్చరిక**

4లో



## మూడింటిలో రెండు కార్పొరేషన్లపై బీజేపీ గురి..!

**గ్రేటర్ విభజనతో మారిన రాజకీయ సమీకరణాలు..**

**సైబరాబాద్, మల్కాజిగిరిపై కమలం ఫోకస్**

4లో

## హైదరాబాద్ నుంచి ఎమిరేట్స్ A-380 సర్వీసు



**దశ, హైదరాబాద్ :** హైదరాబాద్ నుంచి ఎమిరేట్స్ A380 సర్వీసులను ప్రారంభించడానికి ఎమిరేట్స్ విమానయాన సంస్థ సుముఖత వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని ఎమిరేట్స్ విమానయాన సంస్థ (ఇండియా నేపాల్) వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సర్హన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమిరేట్స్ విమానయాన సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారు ముఖ్యమంత్రి తో భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో ఎమిరేట్స్ A380 సర్వీసులను ప్రారంభించడంతో పాటు సంస్థ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో వరంగల్, ఆదిలాబాద్ రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వాటి ప్రాధాన్యతను వివరిస్తూ, తెలంగాణలో ఎమిరేట్స్ MRO ఆపరేషన్స్‌ను కొనసాగించాలని కోరారు. విమాన సర్వీసులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా

..మిగతా 4వ పేజీలో →




4లో

## 117 సీట్లే లక్ష్యం

**రేవంత్ వ్యూహాలకు మా పూర్తి మద్దతు: జగ్గారెడ్డి**

# తెలంగాణలో మినీ సమ్మర్!

### జూలై 15 వరకు బ్రేక్ మాన్‌సూన్.. భారీ వర్షాలకు బ్రేక్, 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు



**దశ, హైదరాబాద్:** తెలంగాణలో మరోసారి ఎండలు విజృంభించనున్నాయి. రాష్ట్రంలో జూలై 15 వరకు రుతుపవనాలు బలహీనపడటంతో ‘బ్రేక్ మాన్‌సూన్’ పరిస్థితులు ఏర్పడనున్నాయని వాతావరణ నిపుణులు తెలిపారు. దీంతో భారీ వర్షాలు దాదాపు లేకుండాపోగా, పగటి ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. జూలై 12 నుంచి 15 వరకు తూర్పు తెలంగాణ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉంది. హైదరాబాద్‌లోనూ 35 నుంచి 37 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా వేస్తున్నారు. ఉక్కపోత పెరగడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వాతావరణ నిపుణుల ప్రకారం, ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం దేశవ్యాప్తంగా మాన్సూన్‌ను ప్రభావితం చేస్తోంది. తూర్పు, ఈశాన్య భారతాన్ని మినహాయిస్తే మిగతా ప్రాంతాల్లో వర్షపాతం లోటు కొనసాగుతోంది. తెలంగాణలో కూడా సాధారణంగా జూలైలో కురవాల్సిన వర్షాలు ఈసారి కనిపించడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే 14 శాతం తక్కువగా నమోదైందని, రుతుపవనాలు ఇదే తరహాలో కొనసాగితే జూలై చివరి నాటికి ఈ లోటు 20 నుంచి 25 శాతానికి పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జూలై రెండో భాగంలో కొన్ని అల్పపీడనాలు ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ, తెలంగాణలో జూలై చివరి పది రోజుల్లోనే వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆ సమయంలో కూడా వర్షాలు లేకపోతే వ్యవసాయం, తాగునీటి పరిస్థితులపై ప్రభావం పడే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# సిటీలో వాకర్లకు కష్టమే!

**ఫుట్‌పాత్‌ల్లో హైదరాబాద్‌కు మూడో స్థానం.. అయినా నడిచేవారికి ఇబ్బందులు తప్పట్లేదు.**

**దశ, హైదరాబాద్:** మన దేశంలో చాలా వరకు ఫుట్ పాత్ లు ఆక్రమణకు గురై ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రధాన నగరాల్లో పాదచారులకు అనుకూలమైన ఫుట్‌పాత్ లు ఎక్కడెక్కడ ఉన్నాయో ‘స్టేట్ ఆఫ్ ఇండియన్ స్ట్రీట్స్ 2026’ ఓ నివేదిక ను విడుదల చేసింది. పాదచారులకు సురక్షితంగా, సౌకర్యవంతంగా నడిచే ఫుట్‌పాత్‌లు ఎంత మేర అందుబాటులో ఉన్నాయనే అంశంపై ఈ అధ్యయనం నిర్వహించారు. ఈ అధ్యయనం ప్రకారం దేశంలో అనుకూలమైన ఫుట్‌పాత్ లు ఈ నగరంలో ఉన్నాయో చూద్దాం..స్టేట్ ఆఫ్ ఇండియన్ స్ట్రీట్స్ ప్రకారం..ఫుట్‌పాత్ ల నిర్వహణ దేశంలోని ఎంపిక చేసిన నగరాల్లో పాదచారులకు అనువైన ఫుట్‌పాత్‌ల శాతంలక్నో 28%,

..మిగతా 4వ పేజీలో →



# గాన సరస్వతి ఎస్. జానకి కన్నుమూత

**దశ, చెన్నై/హైదరాబాద్:** భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఓ శకం ముగిసింది. దక్షిణ భారత గాన కోకిల, ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి (88) శనివారం కన్నుమూశారు. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన ఆమె సంగీత ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు 17కు పైగా భారతీయ భాషల్లో 50 వేలకుపైగా పాటలు ఆలపించి కోట్లాది మంది అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. 1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని పల్లపట్ల గ్రామంలో జన్మించిన జానకి, 1957లో సినీ గాయనిగా ప్రస్థానం ప్రారంభించి భారతీయ సంగీత చరిత్రలో చెరగని ముద్ర వేశారు. ఆమెకు 4 జాతీయ చలనచిత్ర పురస్కారాలు, 33 రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు, అనేక ఫిల్మ్‌ఫేర్, జీవిత సాఫల్య పురస్కారాలు లభించాయి. 2013లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని ఆలస్యంగా గుర్తింపు లభించిందనే కారణంతో స్వీకరించలేదు. ఎస్. పీ. బాలసుబ్రహ్మణ్యంతో కలిసి ఆమె ఆలపించిన వేలాది యుగళగీతాలు తెలుగు సినీ సంగీతానికి చిరస్మరణీయ సంపదగా నిలిచాయి. ఎన్టీఆర్ నుంచి చిరంజీవి వరకు పలువురు అగ్రహీరోల చిత్రాలకు ఆమె గాత్రం ప్రాణం పోసింది. ఆమె మరణంతో భారతీయ సంగీత ప్రపంచం ఓ మహోన్నత గాన మణిని కోల్పోయిందని సినీ, రాజకీయ, సాంస్కృతిక రంగాల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆలపించిన మధుర గీతాలు తరతరాలకు సంగీతాభిమానులను అలరిస్తూనే ఉంటాయని అభిమానులు నివాళులర్పిస్తున్నారు.

# హైదరాబాద్ నుంచి ఎమిరేట్స్ A-380 సర్వీసు

**మొదటి పేజీ తరువాయి**

ఉందని తెలిపారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్ విషయంలో కూడా ఎమిరేట్స్ ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తి మేరకు హైదరాబాద్‌నుంచి ఎమిరేట్స్‌సర్వీసులను ప్రారంభించడానికి మహమ్మద్ సర్వాన్ సానుకూలతను వ్యక్తం చేశారు. అలాగే క్రీడాకారులను ప్రోత్సహించే విషయంలో స్పాన్సర్‌షిప్ అందించడంపైన వారు సానుకూలంగా స్పందించారు.

# మూడింటిలో రెండు కార్పొరేషన్లపై బీజేపీ గురి!

## గ్రేటర్ విభజనతో మారిన రాజకీయ సమీకరణాలు..

## సైబరాబాద్, మల్కాజిగిరిపై కమలం ఫోకస్.

**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల తదుపరి సమరానికి హైదరాబాద్ కేంద్రంగా మారుతోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించి ఎన్నికలకు వెళ్లాలన్న ప్రభుత్వ యోచనతో రాజకీయ పార్టీల వ్యూహాలు మారుతున్నాయి. కాంగ్రెస్ ప్రతిపాదిస్తున్న హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లలో కనీసం రెండింటిపై విజయం సాధించడమే లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతోంది. ఇటీవల పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నవీన్ హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు పార్టీ నేతలతో సమావేశమై ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని రాష్ట్ర నాయకత్వానికి సూచించినట్లు సమాచారం. ప్రభుత్వం గ్రేటర్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించి, డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంచే యోచనలో ఉందని ప్రచారం జరుగుతోంది. ఓల్డ్ సిటీ కేంద్రంగా హైదరాబాద్ కార్పొరేషన్, ఐటీ కారిడార్ పరిధిలో సైబరాబాద్, ఉద్యోగులు, మధ్యతరగతి అధికంగా ఉండే ప్రాంతాలతో మల్కాజిగిరి కార్పొరేషన్ ఏర్పడే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 48 డివిజన్లు గెలుచుకున్న బీజేపీ, ప్రస్తుతం బీఆర్ఎస్ బలహీనపడిన నేపథ్యంలో ఆ ఓటు బ్యాంకును తమవైపు మళ్లించేందుకు కసరత్తు ప్రారంభించింది. ముఖ్యంగా సైబరాబాద్, మల్కాజిగిరి ప్రాంతాల్లో ఐటీ ఉద్యోగులు, వలస ఓటర్లు అధికంగా ఉండటంతో అక్కడ పార్టీకి అనుకూల వాతావరణం ఉంటుందని అంచనా వేస్తోంది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, నగర అభివృద్ధి, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు వంటి అంశాలతో ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ విధానాలను ఎండగడుతూ, మూడు కార్పొరేషన్ల పరిధిలోని 300 డివిజన్లలో బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేసే పనిలో బీజేపీ నిమగ్నమైంది. అయితే గ్రేటర్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించడం, డివిజన్ల సంఖ్య పెంపు వంటి అంశాలపై ప్రభుత్వం అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది. రాజకీయంగా మాత్రం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు తెలంగాణలో ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మక పోరుగా మారనున్నాయి..

# 2 చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు!



## 'సర్' తర్వాత డూప్లికేట్లపై ఉక్కుపాదం

## 89 లక్షల 'అనామలీస్' ఓటర్లకు నోటీసులు: సీఈవో సుదర్శన్‌రెడ్డి

## 'సర్' పూర్తయ్యాక దేశవ్యాప్తంగా డీఎస్పీ సాఫ్ట్‌వేర్‌తో జాబితా ప్రక్షాళన

## ఎన్యుమరేషన్ ఫారం తప్పనిసరి..

## ఫారం ఇవ్వకపోతే ఓటరు జాబితాలో పేరు ఉండదని హెచ్చరిక

**దశ, హైదరాబాద్:** రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియ పూర్తైన తర్వాత రెండుచోట్ల ఓటు కలిగి ఉన్న వారిపై కఠిన చర్యలు తప్పవని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. డూప్లికేట్ ఓటర్లను గుర్తించేందుకు దేశవ్యాప్తంగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి ఓటరు జాబితాను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని, రెండు చోట్ల ఓటు ఉన్నట్లు తేలితే సంబంధిత వ్యక్తికి ఏడాది వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 'సర్' ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని తెలిపారు. సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు.

### ఫారం తప్పనిసరి.. లేదంటే ఓటు లేదు

ఎన్యుమరేషన్ ఫారం అందని వారు లేదా ఓటు ఉన్నప్పటికీ ఫారం అందని వారు వెంటనే తమ పరిధిలోని *బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో)*ను సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు ఎన్యుమరేషన్ ఫారం నింపి ఇవ్వాలని, లేనిపక్షంలో ఓటరు జాబితాలో పేరు నమోదు కాదని స్పష్టం చేశారు.
ప్రస్తుతం ఫారం అందని వారు ఆగస్టులో విడుదలయ్యే ఫారం 6, ఫారం8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. 'సర్' ప్రక్రియ పూర్తయిన తర్వాత కొత్త ఓటర్ల నమోదు కూడా చేపడతామని, దరఖాస్తు చేసిన నెల రోజుల్లోనే ఎన్నికల సంఘం ఓటరు గుర్తింపు కార్డు జారీ చేస్తుందని పేర్కొన్నారు.

### 89 లక్షల 'అనామలీస్' ఓటర్ల గుర్తింపు

తెలంగాణలో సుమారు 89 లక్షల మంది 'అనామలీస్' ఓటర్లను ఎన్నికల సంఘం గుర్తించిందని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. వీరి వివరాల్లో అక్షరదోషాలు, అసంపూర్ణ సమాచారం లేదా ఇతర లోపాలు ఉన్నట్లు గుర్తించామని, వారికి త్వరలోనే నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. అలాగే 2002 నాటి డేటా అందుబాటులో లేని ఓటర్లకు ప్రత్యేక నోటీసులు ఇచ్చి ప్రత్యేక సర్వే నిర్వహిస్తామని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటివరకు 59 శాతం ఫారాలు తిరిగి వచ్చాయని, హైదరాబాద్ పాతబస్తీలోని ఏడు నియోజకవర్గాల్లో కూడా ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

### సంక్షేమ పథకాలపై ప్రభుత్వమే నిర్ణయం

ఓటరు జాబితాలో పేరు లేకపోతే సంక్షేమ పథకాలు అందుతాయా లేదా అన్న ప్రశ్నకు స్పందించిన సుదర్శన్‌రెడ్డి, అది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయానికి సంబంధించిన అంశం అని స్పష్టం చేశారు. ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ పురోగతిపై ఎస్ఎంఎస్‌లు ఎందుకు పంపడం లేదన్న ప్రశ్నకు, అది భారత ఎన్నికల సంఘం (ECI) తీసుకునే నిర్ణయమని చెప్పారు.

### 30 ఏళ్లుగా ఓటు వేసినా... 'సర్'లో మళ్లీ నమోదు తప్పనిసరి

ఏళ్లుగా ఒకే ఇంట్లో నివసిస్తూ ప్రతి ఎన్నికలో ఓటు హక్కు వినియోగిస్తున్న వారైనా, ప్రస్తుతం జరుగుతున్న 'సర్' ప్రక్రియలో మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించడం తప్పనిసరి అని సీఈవో స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో బీఎల్‌వోలు ఇంటింటికీ రావడం లేదన్న ఆరోపణలపై స్పందిస్తూ, వారికి మున్సిపల్ సిబ్బందిని సహాయకులుగా నియమించినట్లు తెలిపారు.



# సిటీలో వాకర్లకు కష్టమే!

**మొదటి పేజీ తరువాయి**

బెంగళూరు 25.9%,హైదరాబాద్ 15.1%, చెన్నై 13.9%, ముంబై, 5.5% గా ఉన్నాయి. ఇతర నగరాలతో పోలిస్తే లక్నోలో పాదచారుల కోసం మెరుగైన మౌలిక సదుపాయాలు ఉండటం వల్ల మొదటి స్థానంలో నిలిచింది. నగర ప్రణాళికలో పాదచారుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ విజయానికి ప్రధాన కారణంగా పేర్కొన్నారు.ఐటీ హబ్‌గా పేరొందిన బెంగళూరు 25.9 శాతం ఫుట్‌పాత్‌లతో రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ 15.1 శాతంతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. నగరంలో కొన్ని ప్రధాన రహదారులపై ఆధునిక ఫుట్‌పాత్‌లు అభివృద్ధి చేసినప్పటికీ, ఇంకా విస్తృత స్థాయిలో మెరుగుదల అవసరమని నివేదిక సూచించింది.చెన్నై 13.9 శాతంతో నాలుగో స్థానంలో ఉండగా, దేశ ఆర్థిక రాజధాని ముంబై కేవలం 5.5 శాతంతో చివరి స్థానానికి పరిమితమైంది. అధిక జనసాంద్రత, రహదారులపై ఆక్రమణలు, పరిమిత స్థలం వంటి కారణాల వల్ల ముంబైలో పాదచారులకు అనువైన ఫుట్‌పాత్‌లు చాలా తక్కువగా ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది.భారత నగరాల్లో ఎక్కువ మంది రోజూ నడిచి ప్రయాణాలు చేస్తున్నప్పటికీ, వారికి తగిన ఫుట్‌పాత్‌లు లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆక్రమణలు, పార్కింగ్, నిర్మాణ పనులు, అసమానమైన ఫుట్‌పాత్‌లు పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని నివేదిక వెల్లడించింది.

### నివేదిక సూచించిన మార్గదర్శకాలు

పాదచారులకు అనుకూలమైన నగరాల అభివృద్ధి కోసం అన్ని నగరాల్లో వెడల్పైన, నిరంతరాయంగా కొనసాగే ఫుట్‌పాత్‌లు, దివ్యాంగులకు అనువైన ర్యాంపులు, జీబ్రా క్రాసింగ్‌లు, సురక్షిత రోడ్డు దాటే సౌకర్యాలు, మెరుగైన వీధి లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలను పెంచాల్సిన అవసరం ఉందని 'స్టేట్ ఆఫ్ ఇండియన్ స్ట్రీట్స్ 2026' నివేదిక స్పష్టం చేసింది. పాదచారుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే నగరాలు నిజమైన అర్థంలో ప్రజలకు అనుకూలంగా మారతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# 117 సీట్లే లక్ష్యం

## రేవంత్ వ్యూహాలకు మా పూర్తి మద్దతు: జగ్గారెడ్డి

## అధిష్ఠానం ఆదేశిస్తే హరీశ్‌పై పోటీ చేసేందుకు సిద్ధమే

**దశ, హైదరాబాద్:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే వ్యూహాలు అమలు చేస్తున్నారని, ఆయన నిర్ణయాలకు పూర్తి మద్దతు ఉంటుందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, 117 అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా సీఎం కార్యాచరణ రూపొందిస్తున్నారని చెప్పారు. అభ్యర్థులకు టికెట్లు ఇవ్వాలా వద్దా అన్నది సీఎం, పీసీసీ చీఫ్, ఏఐసీసీ ఇన్‌చార్జి కలిసి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం నిరంతరం సమీక్ష చేస్తున్నారని, సరిగా పనిచేయని వారికి ఇప్పటికే హెచ్చరికలు ఇచ్చారని తెలిపారు. సూచనలు ఇచ్చిన తర్వాత కూడా పనితీరు మారకపోతే టికెట్‌పై నిర్ణయం పార్టీ అధిష్ఠానమే తీసుకుంటుందని అన్నారు. తాను సంగారెడ్డి నుంచి పోటీ చేయనని చెప్పానేగానీ, మరో నియోజకవర్గం నుంచి పోటీ చేయనని ఎప్పుడూ చెప్పలేదన్నారు. సంగారెడ్డిలో మహిళా రిజర్వేషన్ వచ్చినా, సాధారణ స్థానం అయినా *నిర్మల*నే కాంగ్రెస్ అభ్యర్థి అవుతారని వెల్లడించారు. సర్వేల ఆధారంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి పార్టీ తమకు అనుకూలంగా సర్వేలు చేయించుకుంటుందని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో ఎవరూ శాశ్వతంగా అజేయులు కారని, పార్టీ నిర్ణయమే తుది నిర్ణయమని చెప్పారు. అధిష్ఠానం ఆదేశిస్తే సిద్దిపేటలో హరీశ్‌రావుపై పోటీ చేసేందుకు కూడా సిద్ధమేనని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# యాదాద్రిలో నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

**దశ, యాదాద్రి:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నియమితులైన మన్నె సత్యనారాయణ రెడ్డి తో పాటు నామినేటెడ్ సభ్యులు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వాహక అధికారి (ఈవో) నూతన చైర్మన్, ట్రస్ట్ బోర్డు సభ్యులతో పదవీ, గోప్యతా ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఆలయంలో కొద్ది గంటల పాటు సాధారణ దర్శనాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే యాదగిరిగుట్టకు వచ్చే వాహనాల రాకపోకలపై ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ధర్మకర్తల మండలి రెండేళ్లపాటు లేదా తదుపరి ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడే వరకు బాధ్యతలు నిర్వహించనుంది. కొత్త బోర్డు ఆధ్వర్యంలో యాదాద్రి దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

# యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారానికి సభ్యుడు గైర్హాజరు

**దశ, యాదగిరిగుట్ట:** గత నెలలో ప్రభుత్వం యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యులను నియమించింది. శనివారం బోర్డు ప్రమాణ స్వీకారం ఉండగా సభ్యుడు నరసింహమూర్తి గైర్హాజరయ్యారు. గతంలో ట్రస్ట్ బోర్డులో అనువంశిక ధర్మకర్తకే చైర్మన్ పదవిని కట్టబెట్టడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీకి భిన్నంగా ప్రభుత్వం వేరేవారికి చైర్మన్ పదవి ఇవ్వడంతో ఆయన కినుక వహించినట్టు తెలిసింది. దీంతో ఈ విషయంపై న్యాయపోరాటానికి ఆయన హైకోర్టును ఆశ్రయించినట్టు సమాచారం.

# ఆరు ప్రాణాలు బలి

**మొదటి పేజీ తరువాయి**

అరెస్టు చేసి జైలుకు పంపించారు. సుమారు నెలన్నర తర్వాత జూలై 10న బెయిల్‌పై విడుదలైన రాజ్‌కుమార్ మనసులో మాత్రం ప్రతీకారాగ్ని చల్లారలేదు.

### మొదటి టార్గెట్... కేసు పెట్టిన కుటుంబం

శుక్రవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో రాజ్‌కుమార్ నేరుగా షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలోని మైనర్ బాలిక ఇంటికి వెళ్లాడు. బాలికను బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో అడ్డుగా నిలిచిన తల్లి లక్ష్మి, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో దారుణంగా హత్య చేశాడు. అనంతరం భయంతో వణికిపోయిన మైనర్ బాలికను కారులో బలవంతంగా తీసుకెళ్లి దైవాలగూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు వద్ద అత్యంత కిరాతకంగా హత్య చేశాడు.

### ప్రతీకారం అక్కడితో ఆగలేదు...

బాలిక కుటుంబాన్ని హతమార్చిన తర్వాత రాజ్‌కుమార్ నేరుగా తన ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే అర్ధరాత్రి దాటింది. ఇంట్లో ప్రశాంతంగా నిద్రిస్తున్న భార్య సరిత (33), నాలుగేళ్ల కుమారుడు పరీక్షిత్, రెండేళ్ల చిన్నారి దైవీక్షితపై కూడా కత్తితో దాడి చేసి ముగ్గురినీ హత్య చేశాడు. తన రక్తమే పంచుకున్న ఇద్దరు చిన్నారులను కూడా విడిచిపెట్టకుండా హత్య చేయడం పోలీసులను సైతం విస్మయానికి గురిచేసింది.

### 'అందరినీ చంపేశాను'... తండ్రికి ఫోన్

ఆరు హత్యలు చేసిన అనంతరం రాజ్‌కుమార్ తన తండ్రి అరుణ్‌కుమార్కు ఫోన్ చేసి, "అందరినీ చంపేశాను... నేనూ చనిపోతున్నాను" అని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. వెంటనే అరుణ్‌కుమార్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు రెండు ఘటనాస్థలాలకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం తరలించారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉండగా, అతడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోంది.

### ఆరుగురి ప్రాణాలతో ఆరిపోయిన ఆరు జీవితాలు

ఈ ఘటనలో లక్ష్మి, రుక్కమ్మ, 17 ఏళ్ల మైనర్ బాలిక, సరిత, పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2) ప్రాణాలు కోల్పోయారు. ఒకవైపు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించిన కుటుంబం పూర్తిగా నాశనమవగా, మరోవైపు నిందితుడి భార్య, ఏ పాపం తెలియని ఇద్దరు చిన్నారులు కూడా ప్రాణాలు కోల్పోవడం ఈ ఘటనను మరింత హృదయవిదారకంగా మార్చింది.

### పోలీసుల ముందున్న ప్రశ్నలు

ఈ ఘటన అనంతరం స్థానికుల్లో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోక్సో వంటి తీవ్రమైన కేసులో బెయిల్‌పై విడుదలైన నిందితుడిపై నిఘా ఎందుకు పెట్టలేదు? బాధిత కుటుంబానికి రక్షణ ఎందుకు కల్పించలేదు? ముందస్తు భద్రతా చర్యలు తీసుకుని ఉంటే ఈ ఆరు ప్రాణాలు దక్కేవా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.
ఒక పోక్సో కేసుతో మొదలైన వివాదం... చివరకు ఆరు ప్రాణాలను బలి తీసుకున్న రక్తచరిత్రగా మిగిలిపోయింది.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com